క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ పోటీలు

సారంగాపూర్: మండలంలోని దుప్యా తండాలో శుక్రవారం మహేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన భైంసా జట్టుకు రూ.25వేల నగదు, రెండోస్థానంలో నిలిచిన దుప్యాతండా జట్టుకు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన స్వర్ణ జట్టుకు రూ.5వేల నగదు పురస్కారాలను అందజేశారు. బీజేపీ నాయకులు చంద్రప్రకాశ్‌గౌడ్, నారాయణ, రాంశంకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజేశ్వర్, సాహెబ్‌రావు, రాజు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి ఓం ప్రకాశ్

సోన్: ఆరు నెలలకోసారి విధిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి ఓం ప్రకాశ్ అన్నారు. మండలంలోని లోకల్‌వెల్మల్ గ్రామంలో శుక్రవారం గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జేవీవో మురళి, ఎల్ఎస్ఏ సుప్రియ, చిన్నసాయన్న, పలువురు రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సారంగాపూర్: మండలంలోని రాంసింగ్ తండాకు చెందిన చౌహాన్ ఈనేశ్, ప్రహ్లాద్‌కు చెందిన గొర్రెలు గురువారం పిడుగుపాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం బీజేపీ నాయకులు చంద్రప్రకాశ్‌గౌడ్, నారాయణ, రాంశంకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజేశ్వర్, సాహెబ్‌రావు, కొరిపెల్లి రాజు బాధిత కుటుంబాలను పరామర్శించి.. 10,500లను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ విషయం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి.. సాయం అందేలా చూస్తామని పేర్కొన్నారు.

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వాములు జక్కని గజేందర్, కడార్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన హారతి కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కుంటాల ఏవోగా విక్రమ్



కుంటాల: మండల వ్యవసాయాధికారి(ఏవో)గా విక్రమ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏవో సోమలింగారెడ్డి బదిలీపై వెళ్లగా భైంసా ఏవో ఆసం రవి ఇప్పటివరకు కుంటాలకు ఇన్‌చార్జి ఏవోగా వ్యవహరించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తానని నూతన ఏవో పేర్కొన్నారు.

వీడీసీ కార్యవర్గం

నర్సాపూర్(జి): మండలంలోని బామ్ని(బి)లో వీడీసీ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కదం సాయిదత్తు, ఉపాధ్యక్షుడిగా వినాయక్‌రావు, కోశాధికారిగా డి.నారాయణ, సభ్యులుగా బాపూరావు, భోజన్న దేవిదాస్, కందారం రవి, కొడిచెర్ల భోజన్న ఎన్నికయ్యారు. అనంతరం వీరిని సన్మానించారు.

అరకిలో గంజాయి పట్టివేత

తానూరు: మహారాష్ట్ర నుంచి నిర్మల్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నట్లు ముథోల్ సీఐ మల్లేశ్ తెలిపారు. నిర్మల్ ప్రాంతానికి చెందిన సుధాకర్, దీపక్‌సింగ్ గురువారం రాత్రి మహారాష్ట్ర నుంచి నిర్మల్‌కు వస్తుండగా తానూరు మండలంలోని బెల్‌తరోడా(సరిహద్దు) చెక్‌పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా కన్పించడంతో తనిఖీ చేశామన్నారు. ఇద్దరి నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సై రమేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జోనల్‌స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



సరయు

ముథోల్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సరయు(పదో తరగతి) అండర్-17 విభాగంలో జోనల్ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అమీర్ ఖుస్రూ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సరయు ఈనెల 19న మంచిర్యాల జిల్లాలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

'గిరి' గ్రామాలకు రోడ్డేది?

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- అత్యవసర వేళ తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



వెంకటపూర్‌తండా గ్రామం



వస్తాపూర్ నుంచి రాంపూర్‌కు వెళ్లే మట్టిరోడ్డు

మామడ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మారుమూల ప్రాంతాలకు చేరుతున్నప్పటికీ.. జిల్లాలోని పలు గిరిజన గ్రామాలు రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. మామడ మండలంలోని నల్దుర్తి పంచాయతీలోని వెంకటపూర్‌తండా, వస్తాపూర్ పంచాయతీలోని రాంపూర్, తోటిగూడ పంచాయతీ పరిధిలోని మల్కాపూర్‌కు రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారుతుంది. అత్యవసర వేళ ఆసుపత్రికి వెళ్లాలన్నా.. తిప్పలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వెంకటపూర్‌తండాకు రోడ్డు ఉన్నప్పటికీ.. ఆ గ్రామానికి సమీపంలో ఉన్న ఖానాపూర్ పట్టణం వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మండలంలోని మూడు గ్రామాలు..

మండలంలోని నల్దుర్తి పంచాయతీ పరిధిలోని వెంకటపూర్ తండాలో 500 జనాభా, వాస్తాపూర్ పరిధిలోని రాంపూర్‌లో 400 జనాభా, తోటిగూడ పంచాయతీ పరిధిలోని మల్కాపూర్‌లో 100 వందివరకు జనాభా ఉంటారు.

నల్దుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటపూర్‌తండా అటవీప్రాంతంలో ఉంటుంది. ఈ తండా మామడ మండలంలో ఉన్నప్పటికీ ఖానాపూర్ పట్టణానికి సమీపంలో ఉంటుంది. మామడ మండలకేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ.. ఖానాపూర్ పట్టణం నుంచి మాత్రం ఎనిమిది



వెంకటపూర్‌తండా వెళ్లే మార్గంలో వాగు

కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా.. రోడ్డు సౌకర్యం లేదు. వెంకటపూర్‌తండా నుంచి గ్రామపంచాయతీ నల్దుర్తి వరకు తారురోడ్డు ఉన్నప్పటికీ ఖానాపూర్ వెళ్లేందుకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు లేదు. ఈ తండావాసులు రోజు నిత్యావసర సరుకుల కోసం, పనుల నిమిత్తం ఖానాపూర్ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మధ్యలో వాగు ఉండటంతో వర్షాకాలంలో ప్రమాదకర ప్రయాణమే. అటవీప్రాంతం ఉండటం.. రోడ్డు లేక కాలినడకన వెళ్లి సుర్జాపూర్ రోడ్డు నుంచి ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు.

రాంపూర్ వెళ్లాలంటే కష్టమే..

మండలంలోని గుట్టల మీది గ్రామమైన వాస్తాపూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్ వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆ ఊరి గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాంపూర్‌కు తాంద్ర నుంచి వస్తాపూర్ సమీపం నుంచి రాంపూర్ వెళ్లాల్సి ఉంటుంది. వస్తాపూర్ వరకు బీటీరోడ్డు ఉన్నా.. వస్తాపూర్ నుంచి రాంపూర్ వరకు మట్టిరోడ్డే దిక్కు. ఏటా వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

రోడ్డు నిర్మించాలి..



మా గ్రామం నుంచి ఖానాపూర్ పట్టణానికి వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు బీటీ రోడ్డు నిర్మించి మా గ్రామస్తుల సమస్య పరిష్కరించాలి.

–రాజు, వెంకటపూర్‌తండా

వర్షాకాలంలో ఇబ్బందులు



మా గ్రామం నుంచి ఖానాపూర్ పట్టణానికి వెళ్లే మార్గంలో వాగు ఉంది. వర్షాకాలంలో వాగు దాటి వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. వాగుపై కల్వర్టు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– జాదవ్ గాంధీ, వెంకటపూర్‌తండా

వేంకటేశ్వరస్వామి జాతర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జాతర మహోత్సవం కనుల పండువగా సాగింది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. రథ ప్రాణప్రతిష్ఠ, రథబలి, విష్ణుయాగం, నవగ్రహయాగం, సాంస్కృతిక భజన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం వీధుల గుండా రథోత్సవం సాగింది. వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పండితులు నరసింహమూర్తి, కోటపల్లి అనీశ్, నితీశ్ ఆచార్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం గ్రామసభలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపు, కూలీ పనులకు బడ్జెట్ అంచనాలను తయారు చేశారు. ల్యాండ్ లెవలింగ్, బర్రెలషెడ్, గొర్రెల షెడ్, ఇంకుడుగుంతలు, చెరువులో పూడిక తీత, రైతుల పంట చేలకు రోడ్లు వేయడం, ట్రెంచ్, హార్టికల్చర్ తదితర పనుల కోసం బడ్జెట్‌లో రూ.80 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ సతీశ్ తెలిపారు.పంచాయతీ కార్యదర్శి నవనీత్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్పూర్‌లో..

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025–26ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేశారు. టీఏ రవీందర్ మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సీసీరోడ్లు, చెరువు పూడిక తీత, పొలాల్లో ఓడ్లు, మురికి కాలువల పనులను గ్రామసభలో గుర్తించారు. కార్యక్రమంలో ఈసీ అనిల్, ఎఫ్ఏ సికిందర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

చెక్కు అందజేత

ముథోల్: మండల పరిషత్తు కార్యాలయంలో సరస్వతీనగర్ గ్రామానికి చెందిన మనోహర్‌కు కల్యాణలక్ష్మి చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆత్మస్వరూప్, కాలేవార్ దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వల పరిశీలన

కుభీర్: మండల కేంద్రంలోని కొత్తకాలనీలో గతంలో నిర్మించిన మురుగు కాల్వలను మండల ప్రత్యేక అధికారి మనోహర్, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ పరిశీలించారు. కాల్వల్లో ప్రవాహం ముందుకెళ్లకుండా నీరు ఎక్కడికక్కడ నిలుస్తుందని అధికారుల దృష్టికి కాలనీవాసులు తీసుకొచ్చారు. కాల్వలను సరిచేస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్లాట్లు పరిశీలన

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్‌లో ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్, టీబీపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం రాత్రి హెచ్ఐవీ ఎయిడ్స్, టీబీవ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్ సూచనల మేరకు సుర్జాపూర్‌లో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వేణుగోపాల్, అన్వర్, శ్రీనివాస్, నారాయణ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కుభీర్: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావు పటేల్ రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 120మందికి పంపిణీ చేస్తారని.. లబ్ధిదారులు, పార్టీ కార్యకర్తలు రావాలని కోరారు.

నమోదు కేంద్రం ఏర్పాటు

కుంటాల: పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా శుక్రవారం మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ బోయ సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంతోష్, డైరెక్టర్లు కడార్ల హరిప్రసాద్, సిందె జానకీరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ఖానాపూర్ వాసికి చోటు

ఖానాపూర్: తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీలో ఖానాపూర్ మీసేవ నిర్వాహకుడు కామోజీ వేణుగోపాల్ రాష్ట్ర మీడియా బాధ్యులుగా నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కమిటీ ఎన్నికలో జిల్లా నుంచి పలువురికి చోటు కల్పించినట్లు వేణుగోపాల్ తెలిపారు. చాలీచాలని కమీషన్‌తో మీసేవలను నిర్వహిస్తున్న ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

క్షీరాభిషేకం

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామం నుంచి బామిని(బి) గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్ చిత్రపటానికి శుక్రవారం తురాటి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు

నియామకం



లక్ష్మణ్

నిర్మల్‌చైన్‌గేట్: మాదిగల అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నిర్మల్‌రూరల్ మండలం చిట్యాలకు చెందిన అడ్డిగా లక్ష్మణ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిగులపు లింగన్న నియామక పత్రం శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా లక్ష్మణ్ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వర్షానికి నేలకొరిగిన వరి



పొట్టపెల్లి వద్ద నేలకొరిగిన వరి పంట

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లితోపాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరిపొలాలు నేలకొరిగాయి. చేతికి వచ్చిన పంట నేలకొరగడంతో ఏం చేయాలో తోచడం లేదని రైతులు వాపోతున్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ నుంచి పీచర, ధర్మారం, పార్‌పెల్లి వెళ్లే మార్గంలో మూలమలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాచాపూర్ పంచాయతీ కార్యదర్శి శైలజ శుక్రవారం కార్మికులతో పిచ్చిమొక్కలు తొలగింపజేయించారు. ఇందుకు ప్రయాణికులు కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

నెట్‌కు అర్హత

కుంటాల: దేశంలోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీలో ప్రవేశం కోసం నిర్వహించే యూజీసీ నెట్ -2024కు తెలుగు విభాగంలో కుంటాలకు చెందిన జక్కుల ముత్యం అర్హత సాధించాడు. గత ఆగస్టు 24న పరీక్షలు నిర్వహించగా ఫలితాలు గురువారం రాత్రి వెలువడ్డాయి.

డ్రై డేపై అవగాహన

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే పై గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాగడహారతి ప్రారంభం



మందిరంలో కాగడహారతి వద్ద భక్తులు

కుభీర్:మండల కేంద్రంలోని శ్రీవిఠలేశ్వర మందిరంలో ఏటా మాదిరి ఈసారి కూడా కాగడహారతి ప్రారంభమైంది. నెల రోజుల పాటి ఈ కార్యక్రమం సాగి దీపావళి తర్వాత వచ్చే పౌర్ణమితో ముగుస్తుంది. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి కాగడ హారతిలో పాల్గొంటారు. తెల వారుజామున 5.30 గంటలకు కాగడ హారతి, తర్వాత భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- కుంటాలలో మార్కెట్ ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతుధర పొందాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం కుంటాలలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కుంటాలలో మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, మాజీ ఎంపీపీలు అప్క గజ్జారాం యాదవ్, జీవీ రమణారావు, పిప్పెర వెంగళరావు, జుట్టు మహేందర్, శేఖర్‌రావు, అశోక్‌కుమార్, సుధాకర్, గంగయ్య, గజేందర్, రమణారావు, డైరెక్టర్లు ప్రణయ్‌రావ్, నారాయణపటేల్, మహిపాల్, సాయినాథ్, సీఈవో నాగభూషణం, ఏఈవోలు హర్షిత, గణేశ్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని వేదం గ్లోబల్ స్కూల్‌కు చెందిన చిన్నోళ్ల ప్రశస్తిని(తొమ్మిదో తరగతి) 'ఇండియా ఈస్ అస్' స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన భారతదేశపు ప్రీమియర్ క్రియేటివిటీ నేషనల్ అండ్ ఇంటర్‌స్కూల్ పెయింటింగ్, రైటింగ్ పోటీల్లో భాగంగా పవిత్ర స్వేచ్ఛ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జాతీయస్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. ఈసందర్భంగా శుక్రవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రశస్తి మరిన్ని ఘనతలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, ప్రవళికరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి పొందిన భైంసా పాఠశాల విద్యార్థులు

నిర్మల్‌రూరల్: రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో జిల్లాకు కన్సోలేషన్ బహుమతి లభించినట్లు జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. ఎస్ఈఆర్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో భైంసాలోని వికాస్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్య, మనస్విని, చందు, కిశోర్, కమలేశ్, సూర్యప్రకాశ్, గంగాప్రసాద్ బహుమతులు పొందారు. ప్రోత్సాహక బహుమతి పొందినందుకు డీఈఓ రవీందర్‌రెడ్డి విద్యార్థులను, ఉపాధ్యాయులు రాజన్న, రత్న, మధుకర్‌ను అభినందించారు.

ముగిసిన శారదమాత ఉత్సవాలు

- నేడు నిమజ్జనం



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

భైంసాటౌన్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం ఏటా భైంసా పట్టణంలో శారదమాత ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈసారి పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శారదమాత ప్రతిమలను ప్రతిష్ఠించారు. ఐదురోజులపాటు అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, యువతులు అమ్మవారికి కొలిచారు. శనివారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు భక్తులు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



ప్రింటర్ అందిస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఆ పాఠశాలకు శుక్రవారం రూ.10వేల విలువైన జిరాక్స్ మిషన్, ప్రింటర్ అందజేశారు. ఉపాధ్యాయులు విద్యారాణి, హంసలత తమ గుర్తుగా పాఠశాలకు జిరాక్స్ అండ్ ప్రింటర్ అందచేశారు. అనంతరం ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆర్.అశోక్‌వర్మ, ప్రధానోపాధ్యాయులు గోదావరి, సాయికృష్ణ, పీఆర్టీయూ కార్యదర్శులు సాయిప్రసాద్, దాసరి శంకర్, అశోక్‌కుమార్, గోవర్ధన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల నేపథ్యంలో పార్‌పెల్లి, వడ్యాల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఖానాపూర్: ఖానాపూర్, సుర్జాపూర్‌లోని సబ్‌స్టేషన్లలో నెలవారీ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న మస్కాపూర్, సుర్జాపూర్, ఖానాపూర్, బాదనకుర్తి, వెంకటాపూర్, ఎక్బాల్‌పూర్ గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామని..ప్రజలు సహకరించాలని కోరారు.

లోకేశ్వరం: మండలంలోని పిప్రి, లోకేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఒకటి నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెంబి: పెంబి సబ్‌స్టేషన్ పరిధిలోశనివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

దుస్తుల దుకాణంలో అగ్నిప్రమాదం

- రూ.మూడు లక్షల ఆస్తినష్టం

భైంసాటౌన్: పట్టణంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న దుస్తుల దుకాణంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చినాయ్ కాంప్లెక్స్ సమీపంలో స్నేహ డ్రెస్సెస్ యజమాని దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లగా, కొద్దిసేపటికేలో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపకశాఖకు సమాచారమివ్వగా.. వారు వచ్చి మంటలార్పివేశారు. ఈ ఘటనలో రూ.3లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

సన్మానం

లక్ష్మణచాంద: నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన లక్ష్మణచాందకు చెందిన ఈటెల శ్రీనివాస్‌ను ఐకేపీ మహిళలు శుక్రవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఏపీఎం వాణిశ్రీ, విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, సిబ్బంది పాల్గొన్నారు.